



# కరపత్రం

SINCE 2014

సోమవారం ఏప్రిల్ 28 2025 | సంపుటి :0 | సంచిక :196 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


# నక్సలిజాన్ని మా ప్రభుత్వం

## శాంతిభద్రతల అంశంగా పరిగణించదు: రేవంత్



- మావోయిస్టులతో చర్చలు జరిపేలా కేంద్రాన్ని ఒప్పించాలని శాంతి చర్చల కమిటీ సీఎంను కోరింది.
- శాంతిచర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.
- నక్సలిజాన్ని సామాజిక సమస్యగా చూస్తామని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

హైదరాబాద్: మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి శాంతి చర్చల కమిటీ నేతలు విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని సీఎంను కోరారు. ఈ మేరకు శాంతిచర్చల కమిటీ కన్వీనర్ జస్టిస్ చంద్రకుమార్ సీఎంకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి.. నక్సలిజాన్ని తమ ప్రభుత్వం సామాజిక కోణంలోనే చూస్తుందన్నారు. శాంతి భద్రతల అంశంగా పరిగణించదని చెప్పారు. నక్సల్స్‌తో చర్చలు జరిపిన అనుభవం జానారెడ్డికి ఉందన్నారు. ఈ అంశంపై జానారెడ్డి సలహాలు, సూచనలు తీసుకొని, మంత్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. 2లో

# కేసీఆర్ కడుపులో విషం

## నింపుకొని మాట్లాడారు: పొంగులేటి

**భారాస అధినేత కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు.**



హైదరాబాద్: భారాస రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో భారాస అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగంపై రాష్ట్ర మంత్రులు మీడియాతో మాట్లాడారు. ఆయన తీరును తప్పుబట్టారు. కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు. మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు.

"గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించింది. రెండుసార్లు భారాసకు అధికారం ఇస్తే.. ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవలం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు.
కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారు. 2లో

## తెలంగాణ కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు..



- తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది.

02

## కొడంగల్‌లో రెండు కార్లు ఢీ.. ముగ్గురి మృతి

వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఐనన్‌పల్లి వద్ద రెండు కార్లు ఢీ కొని ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.



02


## కర్రెగుట్టల్లో భారీ సొరంగం.. జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు

ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో ఆరోరోజూ భద్రతా దళాల కూంబింగ్ కొనసాగుతోంది.

02

# పదేండ్లలో తెలంగాణను దగదగలాడించాం..

## అందరూ ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం :



- తెలంగాణకు కాంగ్రెస్ విలన్ నంబర్ 1 అని కేసీఆర్ ఆరోపణ.
- 1956లో నెహ్రూ ఆంధ్రతో బలవంతంగా కలిపారని, 1969 ఉద్యమాన్ని కాంగ్రెస్ అణచివేసిందని విమర్శ.
- తొలుత పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి మౌనంగా నివాళి అర్పించారు.
- ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే పోరాడానని కేసీఆర్ స్పష్టం.
- ప్రజల ఆశీస్సులతో పదేళ్లపాటు అభివృద్ధి సాధించామని తెలిపారు.
- ప్రాజెక్టులు, సాగుభూమి, వైద్య కళాశాలలు పెంపు వంటి విజయాలను వివరించారు.
- రైతుల కోసం రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల వివరాలు చెప్పారు.

హనుమకొండ: తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు.
అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ఆ సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. "1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను. కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసనసభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం.
సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 28 2025

# ఇండియా, దట్ ఈజ్ భారత్!

ఎట్టకేలకు పాకిస్తాన్ తన ముసుగును తొలగించింది. ఉగ్రవాద ముఠాలను పాలుపోసి పెంచి పెద్దచేసింది తామేనని అధికారికంగా అంగీకరించినట్లయింది. పాకిస్తాన్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ రెండు రోజుల క్రితం 'స్కైన్యూస్' ప్రతినిధితో మాట్లాడుతూ అమెరికా కోసం, పశ్చిమ రాజ్యాల కోసం తామీ 'చెత్తపని'ని చేయవలసి వచ్చిందని అంగీకరించారు. అయితే పహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక తమ హస్తం లేదని పాత పద్ధతిలోనే బుకాయించే ప్రయత్నం చేశారు. ఈ బుకాయింపునకు పెద్దగా విలువుండదు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించింది తామేనని అంగీకరించిన తర్వాత వారి కార్యకలాపాలతో తమకు సంబంధం లేదని వాదిస్తే అంగీకరించడానికి ఎవరూ సిద్ధంగా ఉండరు. భారత్‌పైకి ఉగ్ర ముఠాలను ఉసిగొలిపే అవసరం కూడా పాకిస్తాన్‌కే ఉన్నది. ఇప్పుడదొక విఫల రాజ్యంగా ప్రపంచం ముందు నిలబడి ఉన్నది. ఎన్నడూ రాజకీయ సుస్థిరత లేదు. చెప్పుకోదగిన ఆర్థికాభివృద్ధీ లేదు. తరచుగా మిలిటరీ పాలకుల పెత్తనానికి తలొగ్గే దుఃస్థితి. ప్రజాస్వామ్యం ఒక మేడిపండు చందం. 'ద్విజాతి' సిద్ధాంతం అనే విద్వేషపు విత్తనంతో మొలకెత్తిన పాకిస్తాన్ వటవృక్షంగా మారి పిశాచ గణాలకు ఆశ్రయమిస్తున్నది. ముస్లిములు ఒక జాతి, హిందువులు మరొక జాతి అన్నదే ఈ ద్విజాతి సిద్ధాంతం. ఇదొక అసహజమైన భావన. ఒకే ప్రాంతం, ఒకే చరిత్ర, ఉమ్మడి అనుభవాలు, ఆచార వ్యవహారాలు మొదలైన వాటి ప్రాతిపదికపై ఒక జాతిని గుర్తిస్తారు. వీటికి పాలనాపరమైన, చట్టపరమైన అంశాలు కూడా తోడు కావచ్చు. కానీ మతాన్నే జాతిగా భావించే ఆలోచనాధోరణి నుంచి ఇంకా పాకిస్తాన్ బయటపడలేదు. ది రోజుల కిందటి పాకిస్తాన్ ఆర్మీ ఛీఫ్, డిఫ్యాక్టో పాలకుడైన అసీమ్ మునీర్ ఉపన్యాసాన్ని గమనిస్తే సమీప భవిష్యత్తులో ఆ దేశం ఈ ఆలోచన నుంచి బయటపడే అవకాశం లేదని అర్థమవుతుంది. ప్రవాసీ పాక్ వ్యాపారవేత్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పాకిస్తాన్ పుట్టుక గురించి మీ పిల్లలకు చెప్పండి, ఆ తర్వాతి తరాలకు కూడా చెప్పండి. ముస్లింలు వేరనీ, హిందువులు వేరనీ చెప్పండి. మన ద్విజాతి సిద్ధాంతం గురించి చెప్పండ'ని సభికులకు ఆయన నూరిపోశారు. కశ్మీర్ సమస్యను ఎప్పటికీ విడిచిపెట్టబోమనీ, అది తమ జీవనాడని కూడా ఆయన రెచ్చగొట్టారు. ఇది జరిగిన వారం రోజులకే పహల్‌గామ్ దాడి జరగడం గమనార్హం. రెండు ప్రయోజనాల్ని ఆశించి పాకిస్తాన్ పాలకులు ఈ ద్విజాతి విద్వేష భావజాలాన్నీ, కశ్మీర్ అంశాన్నీ జ్వలింపజేస్తున్నారనుకోవాలి. స్వదేశీ పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి వారి భావోద్వేగాలను భారత్‌కు వ్యతిరేకంగా రెచ్చగొట్టడం మొదటిది. ఇక రెండవది %-% భారతదేశ ప్రజలను కూడా మత ప్రాతిపదికన విడదీసి, ఈ దేశాన్ని అస్థిరత పాలు చేయాలని భావించడం. భారత ప్రజలు కూడా మత ప్రాతిపదికపై విడిపోయి విద్వేషాలు వెదజల్లుకుంటే పాకిస్తాన్ పన్నిన ఉచ్చులో చిక్కుకున్నట్టే! పాకిస్తాన్ ప్రస్థానానికి భిన్నంగా భారత్ తన ప్రయాణాన్ని ప్రారంభించింది. లౌకిక, ప్రజాస్వామిక రాజ్యంగా అది తనను తాను ఆవిష్కరించుకున్నది. 'భారతీయులమైన మేము' అంటూ తన రాజ్యాంగ రచనను ప్రారంభించిందే తప్ప విభజన నామవాచకాలను వాడలేదు. దేశం పేరును 'హిందూస్థాన్' అని ప్రకటించాలని కొన్ని వర్గాలు డిమాండ్ చేసినప్పటికీ రాజ్యాంగ సభలోని సభ్యులెవరూ దాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఇండియా లేదా భారత్ అనే పేర్లపైనే సభ్యులు రెండుగా విడిపోయారు. చివరకు 'ఇండియా, దటీజ్ భారత్' అనే అంబేడ్కర్ సూచించిన పదబంధాన్ని అందరూ ఆమోదించారు. హెచ్.వి. కామత్ ఒక్కరే తొలుత 'హింద్' అనే పేరును ప్రతిపాదించి, ఆయనే ఉపసంహరించుకున్నారు. ఆ రకంగా భారత రాజ్యాంగంలో 'ఇండియా, దటీజ్ భారత్ షల్ బీ ఏ యూనియన్ ఆఫ్ స్టేట్స్' అనే వాక్యం ఒకటవ అధికరణంగా చేరింది. బహువిధమైన సువిశాల భారతదేశ భిన్నత్వంలో ఏకత్వానికి ఈ మొదటి అధికరణం అద్దంపట్టింది. హిందూయిజం కూడా దాని అంతస్సారంలో భిన్నత్వంలో ఏకత్వమేనని ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అభిప్రాయపడ్డారు. దాన్నాయన ఒక మతంగా కాకుండా హిందూ జీవన విధానంగా పరిగణించిన విషయం తెలిసిందే. ఈ జీవన విధానంలో భిన్న ఆచార వ్యవహారాలు కలిగిన స్రవంతులు కలిసి ప్రయాణిస్తాయి. సహజీవనం చేస్తాయి. భారతీయత కూడా అంతే! కశ్మీరియత్ కూడా అంతే! కశ్మీరీ హిందూ, ముస్లింల మధ్య ఒకప్పటి మత సౌభ్రాతృత్వం, పరస్పర గౌరవం, ఉమ్మడి పండుగలు, ఉత్సవాలు, సూఫీ %-% భక్తి ఉద్యమాల ప్రభావం, లౌకిక భావాలు కలగలిసిన జీవన విధానమే 'కశ్మీరియత్'గా భావిస్తారు. కశ్మీరీ యువత స్వతంత్ర భావాలను పాక్ ప్రేరేపిత ఉగ్రవాదం హైజాక్ చేసిన తర్వాత కూడా, కశ్మీరీ పండితులను ఈ ఉగ్రవాదం లోయ నుంచి తరిమేసిన తర్వాత కూడా, భారత్ సైన్యాలు కశ్మీర్ లోయను ఒక బందీఖానాగా మార్చి పౌరహక్కుల్ని ఉక్కు పాదాలతో తొక్కేసిన తర్వాత కూడా, ఆర్టికల్ 370 రద్దు ద్వారా ఆ రాష్ట్రానికి ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని ఊడబెరికిన తర్వాత కూడా, ఆ రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేసి, కనీస రాష్ట్ర హోదాను లాగేసుకున్న తర్వాత కూడా 'కశ్మీరియత్' సజీవంగా నిలిచే ఉందని మొన్నటి దాడి సందర్భంగా జరిగిన పరిణామాలు నిరూపించాయి. ఉగ్రవాద మూకలు అమాయక పర్యాటకుల మీద తుపాకులతో తూటాలు కురిపిస్తుంటే వాళ్లను కాపాడేందుకు చావుకు తెగించి ముష్కర మూకను ప్రతిఘటించి ప్రాణాలు బలిపెట్టిన సయ్యద్ హుస్సేన్ సజీవ కశ్మీరియత్‌కు ప్రతీక. ఆ దాడి నుంచి తప్పించుకున్నవారు తమకు అండగా నిలబడి కాపాడిన కశ్మీరీ ముస్లిం యువత మానవత గురించి కథలు కథలుగా చెబుతున్నారు. ఆ రాష్ట్రానికి పర్యాటకులుగా వెళ్లినవారు ఘటన తర్వాత బిక్కుబిక్కుమంటున్న వేళ వందలాది ముస్లిం గృహస్థులు వారికి తోడుగా నిలబడి ఆశ్రయం కల్పించారనీ, సాదరంగా సాగనంపారనీ కూడా వార్తలొస్తున్నాయి. అయితే, ఆ వార్తలకు ప్రధాన స్రవంతి మీడియాలో రావాల్సిన ప్రాధాన్యం రావడం లేదు. సౌభ్రాతృత్వంతో కూడిన 'కశ్మీరియత్'కూ, 'ద్విజాతి' సిద్ధాంతపు విద్వేషానికీ ఎప్పటికీ సాపత్యం కుదరదు. కాకపోతే భారతీయత ఆ సౌభ్రాతృత్వాన్ని సమాదరించి గౌరవించాలి. భారత ప్రభుత్వం కశ్మీరీల కిచ్చిన హామీలను అమలు చేయాలి.

# పదేండ్లలో తెలంగాణను దగదగలాడించాం..

## అందరూ ఆశ్చర్యపోయేలా రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం : కేసీఆర్

మొదటిపేజీ తరువాయి

### ఎన్నెన్నో పథకాలు అమలు చేశాం

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

### తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు.

ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి" అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.




### ఇకపై బయటకు వస్తా.. ప్రజలన తరపున పోరాడతా

" పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 80-90శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరఫున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?" అని కేసీఆర్ ప్రశ్నించారు.

### రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా

"ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా..భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్‌సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 20-30శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

### ఆపరేషన్ కగార్ ఆపేయాలి

భాజపా వైఖరి అంతా భభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం" అని కేసీఆర్ అన్నారు.

# కొడంగల్‌లో రెండు కార్లు ఢీ..

## ముగ్గురి మృతి

మొదటిపేజీ తరువాయి

కొడంగల్: వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఐనన్‌పల్లి వద్ద రెండు కార్లు ఢీ కొని ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కర్ణాటకలోని గనుగాపూర్‌లోని దత్తాత్రేయ స్వామి ఆలయానికి కారులో బయలుదేరి వెళ్లారు. దర్శనానంతరం తిరిగి వస్తుండగా.. చిట్లపల్లి-యాలమద్ది గ్రామాల మధ్య జాతీయ రహదారిపై బొలెరో వాహనం ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను కొండగల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# కేసీఆర్ కడుపులో విషం

## నిప్పుకొని మాట్లాడారు: పొంగులేటి

మొదటిపేజీ తరువాయి



గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత భారాస ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టింది. సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు. మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. భారాస సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు. సభకు అసలు ఆటంకం సృష్టించలేదు.. మేం ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా? ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం. గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది.

యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామని కేసీఆర్ ఆరోపించారు. అసలు యూనివర్సిటీ ఆస్తులను మేం ఎక్కడ విక్రయించాము? ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తోంది. కేసీఆర్ తెచ్చిన ధరణిలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అందరికీ తెలుసు. 'ధరణి' గురించి కేసీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. ఈ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం గురించి ఎందుకు మాట్లాడలేదు? కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలో 8వ అద్భుతం అని చెప్పుకొన్నారు. కానీ, ఇవాళ ఆ ప్రాజెక్టు పనికిరాదని జాతీయ డ్యామ్ సేఫ్టీ కమిటీ నివేదిక ఇచ్చింది. ఏ అంశంపై ఎప్పుడు అసెంబ్లీ పెట్టమంటారో కేసీఆర్ చెప్పాలి. కేసీఆర్ చెప్పిన అంశంపై అసెంబ్లీ చర్చకు మేం సిద్ధం.

భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ నేతకు ఇవ్వాలి. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ఉద్యమం రోజుల్లో చెప్పారు. అది ఎలాగూ చేయలేదు.. కనీసం ప్రతిపక్ష నేత హోదాను అయినా దళితుడికి ఇవ్వొచ్చు కదా..! కేసీఆర్ పగటి కలలను తెలంగాణ ప్రజలు నిజం కానివ్వరు. ఆయన పడగొడితే పడిపోవడానికి ఇది బొమ్మరిల్లు కాదు. మళ్లీ సీఎం అవుతానని భ్రమపడుతూ.. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు" అని పొంగులేటి అన్నారు.

అధికారం పోయిందని అక్కసు: సీతక్క

అధికారం పోయిందనే అక్కసును కేసీఆర్ వెళ్లగక్కారని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారం పోయిన తర్వాత ఆయన కుటుంబంలో చీలికలు వస్తున్నాయని బాధపడుతున్నారు తప్ప.. ప్రజల కోసం కాదని అన్నారు. "కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పార్టీ రజతోత్సవ వేళ ఎవరైనా పార్టీ త్యాగాలు, గొప్పదనాలు చెప్పుకొంటారు. కానీ, కేసీఆర్ మాత్రం కాంగ్రెస్‌ను విమర్శించేందుకే సభ పెట్టారు. పేద మహిళల కోసం ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తే.. వారిని అవమానిస్తున్నారు. కేసీఆర్ అంతదారుణంగా పోలీసు వ్యవస్థను ఇంకెవరూ వాడుకోలేదు. అధికారంలో ఉన్నన్ని రోజులూ పోలీసులను తన ఫామ్‌హౌజ్ వద్ద కాపలా ఉంచారు. ప్రజలు నిరసన తెలిపే అవకాశం లేకుండా ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ మూసివేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెరిపించిన ధర్నాచౌక్ వద్ద ఆయన కుమార్తె ధర్నాలు చేస్తున్నారు. అసెంబ్లీలో మాట్లాడే సమస్యలను ఉత్తికబుర్లని అవమానించారు. అలాంటి వ్యక్తికి మళ్లీ అసెంబ్లీలో అడుగు పెట్టే నైతిక హక్కు ఉందా?" అని సీతక్క ప్రశ్నించారు.

# తెలంగాణ కొత్త సీఎస్‌గా రామకృష్ణారావు..

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి కె. రామకృష్ణారావును నియమించింది. ప్రస్తుత సీఎస్ శాంతికుమారి ఈ నెల 30 పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కొత్త సీఎస్ నియామకంపై గత కొంత కాలంగా ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేసింది.

సీనియారిటీ జాబితా ప్రకారం.. రామకృష్ణారావుతోపాటు ఆరుగురు అధికారులు రేసులో నిలిచారు. వారందరి పేర్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం సమర్థత, అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని 1991 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రామకృష్ణారావును సీఎస్‌గా నియమించాలని నిర్ణయించింది. ఈయన 2014 నుంచి ఆర్థికశాఖ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆర్థికపరమైన నిర్ణయాలు తీసుకోవడం, కేంద్ర నుంచి నిధులు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, ఇతర అవసరాల దృష్ట్యా ఆయన్ని సీఎస్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

మరోవైపు, రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

గుడ్ గవర్నెన్స్ వైస్ ఛైర్మన్ - శశాంక్ గోయల్
ఇండస్ట్రీ, ఇన్వెస్ట్‌మెంట్ సెల్ సీఈవో- జయేశ్ రంజన్
పరిశ్రమలు, వాణిజ్యం ప్రత్యేక ముఖ్యకార్యదర్శి- సంజయ్ కుమార్
ఫైనాన్స్ కమిషన్ మెంబర్ సెక్రటరీ - స్మితా సబర్వాల్
కార్మికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ - దానకిశోర్
పట్టణాభివృద్ధి ముఖ్యకార్యదర్శి (హెచ్ఎండీఏ వెలుపల)- టీకే శ్రీదేవి
పట్టణాభివృద్ధి కార్యదర్శి (హెచ్ఎండీఏ పరిధి) - ఇలంబర్తి
జీహెచ్ఎంసీ కమిషనర్ - ఆర్వీ కర్ణన్
ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కమిషనర్ - కె.శశాంక
జెన్‌కో సీఎండీ - ఎస్. హరీశ్
రాష్ట్రమానవ హక్కుల కమిషన్ సెక్రటరీ, సీఈవో - నిఖిల
ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ - సంగీతం సత్యనారాయణ
దేవాదాయశాఖ డైరెక్టర్, యాదగిరిగుట్ట ఈవో - ఎస్. వెంకటరావు
సెర్ప్ అదనపు సీఈవో - పి. కాత్యాయనీదేవి
ఇండస్ట్రీ, ఇన్వెస్టిమెంట్ సెల్ అదనపు సీఈవో - ఈవీ నర్సింహారెడ్డి
జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ - హేమంత్‌సహదేవ్ రావు
టీజీఎంఎస్ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్ - ఫణీంద్రారెడ్డి
పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ కమిషనర్ - కధిరవన్
హైదరాబాద్ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) - విద్యాసాగర్
హెచ్ఎండీఏ సెక్రటరీ - ఉపేందర్ రెడ్డి

# కర్రెగుట్టల్లో భారీ సొరంగం..

## జల్లెడ పడుతున్న భద్రతా బలగాలు

మొదటిపేజీ తరువాయి



చర్ల: ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో ఆరోరోజూ భద్రతా దళాల కూంబింగ్ కొనసాగుతోంది. మావోయిస్టుల కోసం ఇక్కడి అడవుల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కర్రెగుట్టలను అన్నివైపుల నుంచి చుట్టుముట్టారు. ఈక్రమంలో భద్రతా బలగాలు భారీ సొరంగాన్ని గుర్తించాయి. వెయ్యి మంది తలదాచుకునేందుకు వీలుగా దీని నిర్మాణం ఉంది. లోపల పెద్ద మైదానంతో విశాలంగా ఉన్న సొరంగాన్ని గుర్తించారు. ఇందులో నీటి వసతి, ఇతర సౌకర్యాలున్నట్లు సమాచారం. కొన్ని నెలల పాటు మావోయిస్టులు ఈ సొరంగంలోనే ఉన్నట్లు భద్రతా బలగాలు గుర్తించారు. కొండల్లో పెద్ద సంఖ్యలో ఉన్న మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వారి పరిస్థితి విషమంగా మారుతోందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి. మరోవైపు నిరంతరం జరుగుతున్న ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ఇప్పుడు ఆహారం కోసం ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని చెబుతున్నారు. మావోయిస్టులు ప్రస్తుతం దాక్కున్న అన్ని కొండలను చుట్టుముట్టే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని ప్రభుత్వం, భద్రతా బలగాలు భావిస్తున్నాయి.

ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కి.మీ. పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అతి కష్టం మీద శనివారం సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను, ఆయుధాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. శనివారం భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందినట్లుగా విస్తృత ప్రచారం సాగినప్పటికీ అధికారులు నిర్ధరించలేదు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం ఏప్రిల్ 28 2025

## మావోయిస్టులకు ముస్లిం జిహాదీలకు తేడా ఉందా?

# కర్రెగుట్టకు పెహల్గాం గుట్టలకు పోలిక ఏమిటి?

– శివ పసాద్, మేనేజింగ్ ఎడిటర్ –

**దేశంలో ఇప్పుడు పెహల్గాం దుర్ఘటన దేశాన్ని పట్టి ఊపుతున్నది. ఇంకోపక్క భారత రక్షణ దళాలు మావోయిస్టులపై జరుతున్న కగార్ ఆపరేషన్ కూడా సంచలనం రేపుతున్నది. దేశం రెండు సంఘటనలు పోల్చి చూస్తున్నది.**

**– కాశ్మీర్ లోని పహల్గాం లో ముస్లిం జిహాదీలు మారణాయుధలతో అమాయక యాత్రికులను అతి కిరాతకంగా చంపడం దేశంలో తీవ్రమైన అలజడికి ఆందోళనకు వేదికయింది.ఇస్లాం పేరుతో మారణ హెూమం సృష్టిస్తూ వస్తున్న జిహాదీలు మత విద్వేషంతో అరాచకం సృష్టిస్తున్నారు.ఎందుకు, పర్యాటకులు కాశ్మీర్ కు రాకూడదని, కాశ్మీర్ ఎప్పుడు మండుతూ ఉండాలని. ఆనందం కోసం విహారానికి వచ్చినటువంటి యాత్రికులను చంపడం దేశంలో ఒక తీవ్ర భావోద్వేగాన్ని సృష్టించింది**

ఈ సంఘటనకు అబూజ్ మడ్ అడవుల్లో మావోయిస్టుల గెరిల్లా ఆర్మీ అడవుల్లో తమ రాజ్యం మాత్రమే ఉండాలనే డిమాండ్ కూడా జీహాదీల లాంటిదే.అబూజ్ మడ్ లో జరుగుతున్న రక్షణ దళాల వేట, జిహాదీలతో రక్షణ దళాలు జరుపుతున్న పోరు ఒకే రకమైనది. ఈ రెండు విషయాలను ప్రజలు తరచి తరచి చూస్తున్నారు. ఈ విషయాలే ఇప్పుడు చర్చకు వస్తున్నాయి.

### – రెండు సంఘటనలకు ఒకే పోలిక ఉన్నది

కాశ్మీర్ కు బయటి వాళ్లు ఎవరు రాకూడదని జిహాదీలు బహిరంగంగా ప్రకటించడం, కర్రెగుట్ట చుట్టూ బాంబులు, ప్రెజర్ మైన్స్ పెట్టామని రక్షణ దళాలు సామాన్య ఆదివాసీలు ప్రజలు ఈ వైపు రాకూడదని మావోయిస్టు అనడం తో సామాన్య ప్రజలకు కూడా ఈ వైఖరి మింగుడు పడడం లేదు.

**– కాశ్మీరు జిహాదీలది, అబూజ్ మడ్ దండకారణ్యం మావోయిస్టులది**

**ఇదేనా సాయుధ శక్తులు కోరుకునేది?**

**– మన భారత దేశము స్వాతంత్రం పొందింది 1947 ఆగస్టు 15వ తేదీన కాదు.**
**మన దేశ నిజమైన స్వాతంత్రం పొందింది, సొంత రాజ్యాంగము రచించుకొని సర్వసత్తాక గణతంత్ర రాజ్యాంగా ప్రకటించబడిన 1950 జనవరి 26వ తేదీన**

అప్పటివరకు బ్రిటిష్ కు చెందిన వైస్రాయ్ ఆధ్వర్యంలో పనిచేసిన భారత ప్రధాని ఒక తోలుబొమ్మ.ఈ మూడేళ్ల స్వతంత్ర పాలన కేవలం బ్రిటిష్ రాజ్యపు కను సన్నల్లో నడిచిన బానిస స్వరాజ్యం.మన భారత ప్రధానిగా నెహ్రూ ఉన్నప్పటికీ అతడు కేవలం బ్రిటిష్ సామ్రాజ్యపు ప్రతినిధిగా మాత్రమే పని చేశాడు.ఆ సంధి కాలంలో మన నుంచి విడిపోయిన పాకిస్తాన్ కాశ్మీర్ ను కబళించడానికి చేయని ప్రయత్నం లేదు. దానికి ఉదారత పేరుతో వెన్నెముక లేని మన దేశ నాయకత్వం కాశ్మీర్లో అల్లకల్లోలానికి కారణమైంది. మంచు కొండల్లో రగిలిన మంటలు ఇంకా దేశాన్ని కాల్చుతూనే ఉన్నాయి. మతం పేరుతో విడిపోయినటువంటి పాకిస్తాన్ దేశంలో ప్రజాస్వామ్యం లేదు. అది ఇస్లామిక్ రిపబ్లిక్ గా ప్రకటించుకున్నది. ఆ ఇస్లామిక్ రిపబ్లిక్ పాకిస్తాన్ మన భారత దేశ ప్రజల సహనాన్ని పరీక్షిస్తూనే ఉన్నది. 1947 నుంచి నేటి వరకు లక్షల మంది కాశ్మీర్లో చంపబడ్డారు, రక్తం చిదించారు, ఇల్లు ముంగిలి వదులుకొని సొంత దేశంలో కాందీ శీకులుగా బతుకులు వెళ్లదీస్తున్నారు.ఈ స్థితి సృష్టించింది ఆయుధం.ఆ ఆయుధం అంతులేని హింసకు దారితీసింది. ఆ ఆయుధమే కాశ్మీర్ లో ప్రత్యేక ప్రతిపత్తి కొరకు ఆర్టికల్ 370 ని సృష్టించింది.ఆర్టికల్ 370 పూర్తిగా రాజ్యాంగ వ్యతిరేకం. అందుకే భారత పార్లమెంటు ఆర్టికల్ ను తొలగించింది.370 ఆర్టికల్ తొలగింపు తర్వాత కాశ్మీర్లోని సమాజంలో కోల్పోయిన శాంతిని పునః స్థాపన చేస్తుంటే సహించలేని ఇస్లాం మత శక్తులు మళ్లీ ఆయుధాన్ని ప్రయోగించాయి. కాశ్మీర్ వైపు కన్నెత్తి చూడకండి.. అంటూ దేశాన్ని, ప్రపంచాన్ని ఆయుధంతో హెచ్చరించాయి.

**– ఇప్పుడు దండకారణ్యం లో జరుగుతున్నది ఏమిటి?**
**అడవుల్లో సైతం అదే ఆయుధ భాష వినిపిస్తున్నది.**

అడవిలో ఆదివాసీలు ఉన్నారని, అడవిలో అపూర్వ ఖనిజ సంపదలు ఉన్నాయని, అవి దోచుకోవడానికి ప్రభుత్వాలు అడవి బిడ్డలపై దండెత్తుతున్నాయని మావోయిస్టులు ఇప్పుడు నీతి వాక్యాలు పలుకుతున్నారు.అడవి బిడ్డల చేతికి ఆయుధాలు ఇచ్చింది ఎవరు? ఆ అడవి బిడ్డలను అడ్డం పెట్టుకొని ఆదివాసీల పేరు మీద ప్రత్యేక రాజ్యాన్ని, సమాంతర ప్రభుత్వాలను, జనతన సర్కార్ ను నడుపుతున్నది ఎవరు? చైనా చైర్మన్ మావో మా చైర్మన్ అంటూ నిస్సిగ్గుగా




ప్రకటించుకున్న అతివాద కమ్యూనిస్టులు వివిధ రూపాలు మార్చుకొని ఇప్పుడు "మావో" ఇష్టులుగా చెప్పుకుంటూ చేస్తున్న సాయుధ పోరు ఎవరి మీద? నేపాల్ నుంచి కేరళ వరకు రెడ్ కారిడార్ సృష్టించి దేశంలో కమ్యూనిస్టు రాజ్యాన్ని స్థాపించాలని ఒక బ్లూ ప్రింట్ ప్రకటించుకొని దానికి ప్రచారం కల్పించి, అది ప్రగతిశీల ఉద్యమమని "ఎర్ర రంగు" పూసి అమాయకులతో దేశ ప్రజలతో ఆటలాడుకుంటున్నటువంటి ఈ సాయుధ పోరు ఎవరి మీద?
రాజ్యాంగాన్ని ధిక్కరించి, భారత చట్టాలను ధిక్కరించి హింస చేస్తూ, ప్రభుత్వాన్ని ఎదిరిస్తూ జరుపుతున్న పోరాటం దేనికొరకు? మన దేశ భారత రాజ్యాంగం సమగ్రమైనది, సంపూర్ణమైనది. ప్రపంచంలో ఏ దేశంలో లేని అత్యుత్తమ రాజ్యాంగం మనము రూపొందించుకున్నాము.మహానుభావుడు దివంగత అంబేద్కర్ రూపొందించి అందించిన భారత రాజ్యాంగాన్ని కాదని, మావోయిస్టులు పోరాటం జరుపుతున్నది ఎవరిపైన?

**జిహాదీల సాయుధ పోరు, మావోయిస్టుల సాయుధ పోరు.. రెండూ రాజ్యాంగ వ్యతిరేకమైనవే. ఈ దేశ సార్వభౌమత్వాన్ని రాజ్యాంగాన్ని చట్టాలను వ్యతిరేకిస్తున్నవే**

ఇస్లామిక్ జిహాదీలు కాశ్మీర్ వైపు భారత ప్రజలు రక్షణ దళాలు రావద్దని హెచ్చరిస్తాయి.
అబూజ్ మడ్ తో పాటు దండకారణ్యంలోకి ప్రజలు రక్షణ దళాలు రావద్దని మావోయిస్టులు అంటారు.కాశ్మీర్ కేవలం కాశ్మీర్ ప్రజలది మాత్రమేనని జిహాదీలు అంటారు. అడవి ఆదివాసీలది మాత్రమేనని మావోయిస్టులు అంటారు.
ఈ రెండు సాయుధ పోరుల భాష ఒక్కటే. అది ఆయుధ భాష. దేశ విభజన మత ఆధారంగా జరిగింది. అప్పటి సంస్థానాలు అన్ని బ్రిటిష్ ప్రభుత్వము భారత నాయకత్వము కలిసి రూపొందించిన ఒక ఒడంబడిక ప్రకారము దేశ విభజన జరిగింది.ఆ ఒడంబడికను ఒప్పుకోమని ముస్లిం జిహాదీలు అంటారు. ఇది బూటకం ప్రజాస్వామ్యం అని,ఈ రాజ్యాంగాని కాదని సమ్యూనిస్ట్ రాజ్యం స్థాపిస్తామని మావోయిస్టులు అంటారు. ఈ రకమైన భావజాలం, రాజ్యాంగ వ్యతిరేక ఉద్యమాలు, సాయుధ ఉద్యమాలు దేశాన్ని గందరగోళం వైపు నడిపించాయి.బ్రిటిష్ కాలపు భావదాస్య వైఖరి నుంచి ఇంకా బయటపడని స్వార్థ శక్తులు ఈ సాయుధ పోరుకు వంత పాడుతుంటాయి.

### – రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వారికి రాజ్యాంగ హక్కులు వర్తించవు

ఇష్టారాజ్యంగా వ్యవహరించే పద్ధతి హక్కుల కిందికి రాదు. అది కచ్చితంగా భారత చట్టాలకు వ్యతిరేకము.ఇష్టారాజ్యంగా వ్యవహరించే ప్రతి పౌరుడు కూడా నాకు హక్కులున్నాయని, నన్ను ఈ రాజ్యాంగం చట్టాలు ప్రశ్నించకూడదని అనలేరు. అనకూడదు.తప్పు చేసిన వారిని శిక్షించడానికి చట్టాలు రూపొందించారు.అది వ్యక్తులైనా, సంస్థలైనా, పార్టీలైనా,ఉద్యమాలైనా.. రాజ్యాంగానికి లోబడి, చట్టాలకు లోబడి మాత్రమే పని చేయాల్సి ఉంటుంది.కాశ్మీర్ లో హింస, ఉద్యమాలు సాయుధ పోరు జరుగుపున్నటువంటి జిహాదీలకు, కమ్యూనిజం పేరుతో పీడిత తాడిత ప్రజల పేరుతో మావో పేరుతో సాయుధ పోరు జరుపుతూ భారత చట్టాలు రాజ్యాంగాన్ని చచ్చు బండలుగా మార్చి, మాకు హక్కులు ఉన్నాయని ఎవ్వరూ అనలేరు.వ్యక్తి కంటే ఒక పార్టీ కంటే ఒక ఉద్యమం కంటే ఈ దేశ రాజ్యాంగము చట్టాలు అత్యున్నతమైనవి. అనుసరనీయమైనవి. ఈ చట్టాలను ఆచరించడం తప్ప ధిక్కరించే అధికారం ఎవ్వరికీ లేదు.అది జిహాదీయులైనా,మావోయిస్టులైనా, ఇంకేరకమైన పోరాటమైనా రాజ్యాంగానికి చట్టాలకు లోబడి మాత్రమే ఉండాల్సి ఉంటుంది. కాశ్మీర్ కొండలు, కాశ్మీర్ లోయలు, కాశ్మీర్ అందాలు మొత్తం భారతదేశానికి చెందినవి.
అదే రకంగా దేశంలోని గ్రామాలు పట్టణాలు అడవులు,దండకారణ్యం.. అన్నీ కూడా భారతదేశానికి చెందినవి.దేశంలో ఎక్కడ కూడా స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన రాజ్యాలు లేవు ఉండవు ఉండకూడదు.ఈశాన్య రాష్ట్రాలలో మతం పేరుతో జరుగుతున్న కుట్రలు, ఈశాన్య రాష్ట్రాలను మన భారతదేశము నుంచి విడదీయాలని జరుగుతున్న కుట్రలు ఈ దేశంలోని సామాన్య ప్రజలకు కూడా అర్థం అవుతున్నాయి. మణిపూర్ లో జరుగుతున్నది కూడా అదే. మణిపూర్ లో కుకీలు గా పిలవబడే క్రైస్తవులు జరుపుతున్నది కూడా సాయుధ పోరే. దేశ పాలనలో స్పష్టమైన రాజకీయ కార్యాచరణ లేని పార్టీలు ఓట్ల కొరకు బుజ్జగింపు రాజకీయాలు చేస్తూ సాయుధ పోరును అనుమతిస్తూ తమకు తామే ప్రజాస్వామిక వాదులుగా ఉదారవాదులుగా ప్రకటించుకుంటూ దేశాన్ని అల్ల లకల్లోలం చేశారు.

**– కాశ్మీర్ అయినా, అబూజ్ మడ్ అడవులు అయినా భారత భూభాగాలే**

ఈ ప్రాంతాలకు రాకూడదని హక్కు జిహాదీలకు లేదు, మావోయిస్టులకు లేదు.ఈ బూటకపు హక్కుల పోరాటాలు చెల్లవు.పహల్ గాం కొండలు, అబూజ్ మడ్ అడవులు భారత భూభాగాలు.భారత రాజ్యాంగాన్ని, భారత చట్టాలను ధిక్కరించే వారికి హక్కులు ఉండవు.
చట్టాలకు లోబడే వారికే హక్కులుంటాయి.ఆదివాసీల పేరుతో, వనవాసీల పేరుతో, మతం పేరుతో సాయుధ పోరు జరిపే హక్కు ఎవరికీ లేదు ఉండదు.78 సంవత్సరాల స్వతంత్ర భారతం సర్వసత్తాక మైనది. స్వతంత్ర రాజ్యాంగము. స్వతంత్ర చట్టాలు కలిగి ఉన్నది. రాజ్యాంగ రక్షణ కొరకు ఈ దేశ చట్టాల రక్షణ కొరకు భారతదేశ హెూంశాఖ మంత్రి శ్రీ అమిత్ షా మావోయిస్టుల నిర్మూలన కొరకు జిహాదీయుల నిర్మూలన కొరకు స్పష్టంగా మాట్లాడుతున్నాడు.ఈ కార్యాచరణ కరెక్ట్ అని సామాన్య భారతీయుడు అర్థం చేసుకున్నాడు.

**మావోయిస్టుల ఫ్రంటల్ ఆర్గనైజేషన్స్ ఎన్ని సమావేశాలు చర్చలు పెట్టినా చెల్లవు.**

**అంబేద్కర్ అందించిన రాజ్యాంగ రక్షణ మనందరి విధి, కర్తవ్యం.**

## చల్లూరు సంతలో చలివేంద్రం ప్రారంభించిన అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారు.

**కరపత్రం ప్రతినిధి ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 27**
కరీంనగర్ జిల్లా, వీణవంక మండలం, చల్లూరు గ్రామంలో ప్రతి ఆదివారం రైతు వేదిక వద్ద జరుగుతున్న వారసంతలో సంతకు వచ్చే ప్రజల సౌకర్యార్థం వేసవికాలం దృష్టిలో ఉంచుకొని అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వారి ఆధ్వర్యంలో విజయ వాటర్ ప్లాంట్ చల్లూరు వారి సౌజన్యంతో చలివేంద్రం ప్రారంభించినారు. ఈ సందర్భంగా అమ్మ ఫౌండేషన్ మల్లారెడ్డిపల్లి వ్యవస్థాపక అధ్యక్షులు గోనెల సమ్మన్న ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి ముద్దసాని శ్రీనివాసులు మాట్లాడుతూ వేసవికాలం ఎండలు తీవ్రంగా ఉన్నందున ఆదివారం అంగడికి వచ్చే ప్రజల




సౌకర్యార్థం వారి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రం ప్రారంభించినామని ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతు విజయ వాటర్ ప్లాంట్ చల్లూరు వారికి మరియు మాకు సహకరిస్తున్న



దాతలందరికీ ధన్యవాదాలు తెలియజేసినారు.ఈ కార్యక్రమంలో సభ్యులు ఎలువాక నరేష్, గోమాత ఫ్లెక్సీ ప్రింటర్ సాయి, విజయ వాటర్ ప్లాంట్ నల్లగొని మొగిలి గౌడు, సదానందం గౌడ్ ,గాజుల హరిత, కడమంచి దివ్యలు పాల్గొన్నారు.

## మే డే గోడ ప్రతులను ఆవిష్కరించిన కార్మిక సంఘ నాయకులు




**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ ఏప్రిల్ 27**
బాన్సువాడ పట్టణంలోని సిపిఐ పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం కార్మిక దినోత్సవం మే డే దినోత్సవ సందర్భంగా రూపొందించిన గోడప్రతులను ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు కార్మిక నాయకులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులు మేడే దినోత్సవం పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు మేడే దినోత్సవం పురస్కరించుకొని డెలివరీ, వివాహ, మరణానికి సంబంధించిన పరిహారం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాస్, గంగాధర్, పరమేష్, సాయిరాం ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ బయలుదేరిన బారాస శ్రేణులు ..

**– బిఆర్ఎస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం.. షేక్ జుబేర్**

**కరపత్రం ప్రతినిధి బాన్సువాడ ఏప్రిల్ 27**
బాన్సువాడ పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి ఆదివారం వరంగల్ లో నిర్వహించే బి ఆర్ ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో భారత శ్రేణులు బస్సులు, వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ నేపథ్యం నుంచి పుట్టిన పార్టీ బిఆర్ఎస్ పార్టీ అని టిఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ రాష్ట్రం సాధ్యం అయిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్



హయాంలో ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు రాష్ట్రం అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ పాలనలో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాని వినేందుకు ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు.ఈ కార్యక్రమంలో నాయకులకు మోచి గణేష్, సాయిబాబా, శివ సూరి, రమేష్ యాదవ్, గౌస్ మౌల తదితరులు తరలి వెళ్లారు.

## ఆత్మీయంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం...

**కరపత్రం ప్రతినిధి బోధన్ ఏప్రిల్ 27..**
బోధన్ పట్టణంలోని తట్టికోట్ లో గల శ్రీనివాస ట్యుటోరియల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాల ప్రాంగణంలో పూర్వ విద్యార్థులు అందరూ కలిసి తమ చిన్న నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందహెూత్సవాల నడుమ ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బరాజు దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిలు, దీపక్, ఇందిర, విజయలక్ష్మి, శోభ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



భూపాలపల్లి జిల్లా: మోట్లపల్లి గ్రామము ఏప్రిల్27. మండల్ మొగుళ్లపల్లి.

వ్యవసాయ పనులకు వెళ్లిన ఒక రైతు వడదెబ్బకు గురి అయ్యి అపస్మారక స్థితికి చేరుకొని ప్రాణాలు వదిలిన సంఘటన జరిగినది. వివరాల్లోకి వెళితే ముట్లపల్లి గ్రామమానికి చెందిన మిరుపూరి.రాజయ్య వయస్సు 65 సంవత్సరాలు నిరుపేద రోజువారీ కూలీ రైతు. కూలి పనులకు వెళ్లి భోజనానికి తిరిగి ఇంటికి చేరుకుని అస్వస్థతకు గురి అయ్యి ప్రాణాలు విడిచినాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఇలాంటి నిరుపేద కూలీ రైతులకు ప్రభుత్వం అండగా ఉండి తగిన సహాయం అందించి ఆదుకోవాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు.

## 1999-2000 ఎస్ ఎస్ సి పూర్వ విద్యార్థుల, ఆత్మీయ సమ్మేళనం..




**కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 27**

వీణవంక మండల చల్లూర్ జడ్పీ ఎస్ ఎస్ పాఠశాలలో చదివిన 1999-2000 సంవత్సరంలో ఎస్ఎస్సి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అపూర్వ, ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూలమాలవేసి, శాలువా కప్పి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థులు ఆనాటి తీపి జ్ఞాపకాలను, గురువులు నేర్పిన క్రమశిక్షణను గుర్తుతెచ్చుకొని, స్నేహితులతో పంచుకున్నారు. విద్యార్థి దశలో ఉపాధ్యాయుడు తన జ్ఞానాన్ని పంచడంతోనే, మనం ఈరోజు ఇంతటి విజ్ఞాన వంతులమయ్యామని,ఆనాటి గురువులకు పాదాభివందనాలు అంటూ, గురువులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పూర్వ విద్యార్థులు తమ జీవితంలో జరిగిన సంఘటనలను స్నేహితులతో పంచుకున్నారు. కష్టసుఖాలలో సహాయపడేవారు స్నేహితులని కొనియాడారు. అనంతరం సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గురువులు మధు మోహన్ రావు,రాముకుమార్ ,సుధాకర్, వెంకటేశ్వర్లు, సుదర్శన్, శ్రీధర్, శాంతి కుమార్, సురేందర్,పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్జీ 1లో సర్వే మజ్దూర్ ఎంపిక పరీక్ష



**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

ఆర్జీ వన్ ఏరియాలోని అంతర్గత అభ్యర్థులచే సర్వే మజ్దూర్ ఎంపిక పరీక్ష ఆదివారం స్థానిక సింగరేణి పాఠశాల సెక్టార్-2లో నిర్వహించారు. ప్రవేశ పరీక్ష 199 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష సర్వే మజ్దూర్ ఖాళీలను నింపడం కోసం పారదర్శకంగా నిర్వహించారు. ఎలాంటి అవకతవక తావు లేకుండా అభ్యర్థుల కు వచ్చిన మార్కుల ఆధారంగా రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేయడం జరుగుతుందని ఎస్ఓటు జీఎం గోపాల్ సింగ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఏరియా సర్వే ఆఫీసర్ లక్ష్మి రాజు, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి, సీనియర్ పర్సన్ ఆఫీసర్ ఫిరోజ్ ఖాన్, సీనియర్ సర్వే ఆఫీసర్ ఆడెపు భాస్కర్, రావుల దామోదర్, వెల్ఫేర్ ఆఫీసర్ ఇక్బాల్ షరీఫ్, ఆఫీసు సూపరింటెండెంట్ వూట్ల దేవాచారి, అన్వేష్, సంతోష్ కుమార్, ఇన్చార్జ్ హెడ్మాస్టర్ స్వర్ణలత, పాఠశాల సిబ్బంది, జూనియర్ ఇన్స్టక్టర్ అక్బర్ ఆలీ, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## అనాద పిల్లల ఆశ్రమంలో అన్నదానం




**కొమురయ్య నాగం,కరపత్రం ప్రతినిధి**

గోదావరిఖని వినోభనగర్ లో గత రెండు సంవత్సరాల క్రితం అనారోగ్యంతో చనిపోయిన ఎక్కిరాల చంద్రమ్మ జ్ఞాపకర్థం స్థానిక గాంధీనగర్ లోని ఎండీహెచ్డబ్లుఎస్ అనాధ ఆశ్రమంలో అన్నదాన కార్యమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భర్త ఎక్కిరాల లక్ష్మయ్య, కొడుకులు రమేష్ సురేష్, కోడలు స్వరూప, కూతుర్లు అల్లుళ్ళు తిరుపతమ్మ కుమారస్వామి, భాగ్యలక్ష్మి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి..

- గాలిపూర్ లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయం





**కరపత్రం ప్రతినిది బాన్సువాడ ఏప్రిల్ 27**

నిజాంసాగర్ మండలంలోని గాలిపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను విజయవంతం చేయాలని గౌడ సంఘం నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 5 తేదీన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయని, గ్రామదేవతలకు ఊరేగింపు కార్యక్రమంతో కార్యక్రమం ప్రారంభమై 6 వ తేదీన గణపతి పూజ పుణ్యవచనం, 7 వ తేదీన హెూమాలు, జోగి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. 8వ తేదీన విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట అమ్మవారి దర్శన పూజా కార్యక్రమాలు నిర్వహించి, 9 తేదీన రేణుక ఎల్లమ్మ జమదగ్ని కళ్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా వేద పండితుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని గ్రామస్తులు గౌడ కులస్తులు అందరూ సకాలంలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. విగ్రహ ప్రతిష్టపైన మహోత్సవంలో ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, ఎల్లమ్మ నాటక ప్రదర్శనతో పాటు, వేద పండితుల ప్రవచనాలు చేయనున్నారని భక్తులు సకాలంలో హాజరై విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

# కనీస వేతనం అమలుకై మేడే పోస్టర్ల ఆవిష్కరణ



**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసిఐ)ఆధ్వర్యంలో నగరంలోని వివిధ సర్కిళ్లలో మున్సిపల్ డ్రైవర్లు,కార్మికులు 139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీయూసిఐ,జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు డి.రవికిరణ్,ఎన్.రవి లు మాట్లాడుతూ,మున్సిపల్ కార్మికులను పాలక వర్గాలు మాటల్లో పొగుడుతున్నాయని,కానీ ఆచరణలో వారికి ఎలాంటి ఓదార్పు దక్కడంలేదన్నారు.ఉద్యోగ,ఆరోగ్య భద్రత లేదన్నారు.పనిభారం పెరుగుతూ వేతనాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు 26,000కనీస వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ,మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఆమోదించి,అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు.మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్,సమాన పనికి సమాన వేతనం కోసం,ఉద్యోగ,సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు.కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను నిలుపుదల చేయాలని,పనిగంటల పెంపుదలను వ్యతిరేకిస్తూ జిల్లాలో 139 వ మేడే జరుపుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డ్రైవర్లు,కార్మికులు రాము,శాంతికుమార్,విజయ్,లక్ష్మణ్, సంతోష్ గౌడ్, సాయిలు,నరేష్,భూపతి,జగదీష్,గంగమణి,యాదమ్మ,శైలజ,శ్రీధర్ ,నాగరాజు,అశోక్,విజయలక్ష్మి,గంగాధర్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# రజతోత్సవ సభకు తరలిన బిఆర్ఎస్ నిజామాబాద్ అర్బన్ సైన్యం











- కార్యకర్తలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భారీ ఏర్పాట్లు...
- మంచినీరు,మజ్జిగ,భోజన ఏర్పాట్లు...

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ భారీ సభకు నిజామాబాద్ మాజీ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో రజతోత్సవ వేడుకలకు భారీ ఎత్తున నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం 54 డివిజన్ల నుంచి బయలుదేరారు.నిజామాబాద్ అర్బన్ మాజీ శాసనసభ్యులు గణేష్ బిగాల గులాబీ సైన్యానికి ఎలాంటి లోటు రాకుండా మంచినీటి సౌకర్యం,జెర్సీ మజ్జిగ ప్యాకెట్లు,భోజనం ఏర్పాట్లు చేశారు.సభకు వెళ్లేముందు ఆహారం అందించడంతోపాటు.మళ్లీ తిరుగు ప్రయాణంలో భోజన సౌకర్యం కల్పించనున్నారు.సిద్దిపేట మార్గమధ్యంలో ఓ ఫంక్షన్ హాల్ లో అర్బన్ నియోజకవర్గ కార్యకర్తలకు భోజన సౌకర్యాన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.కార్యకర్తలు గులాబీ టీషర్టు వేసుకొని స్వచ్ఛందంగా సంబరాలు చేసుకుంటూ వెళ్లారు.52 బస్సులు,270 కార్లు,3500 మంది అర్బన్ కార్యకర్తలతో అర్బన్ బిగాల గులాబీ సైన్యం బయలుదేరింది.కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా ఇంత పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలి రావడంతో బిగాల వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# కనీస వేతనం అమలుకై మేడే పోస్టర్ల ఆవిష్కరణ

**సాయికృష్ణ కట్కం, కరపత్రం ప్రతినిధి**

తెలంగాణ ప్రగతిశీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (టీయూసిఐ)ఆధ్వర్యంలో నగరంలోని వివిధ సర్కిళ్లలో మున్సిపల్ డ్రైవర్లు,కార్మికులు 139వ మేడే పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా టీయూసిఐ,జిల్లా ప్రధానకార్యదర్శి ఎం.సుధాకర్,మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు డి.రవికిరణ్,ఎన్.రవి లు మాట్లాడుతూ,మున్సిపల్ కార్మికులను పాలక వర్గాలు మాటల్లో పొగుడుతున్నాయని,కానీ ఆచరణలో వారికి ఎలాంటి ఓదార్పు దక్కడంలేదన్నారు.ఉద్యోగ,ఆరోగ్య భద్రత లేదన్నారు.పనిభారం పెరుగుతూ వేతనాలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికులకు 26,000కనీస వేతనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు.కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 15 చట్టాలను కేంద్ర ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ,మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా ఆమోదించి,అమలు చేయాలని చూడడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారని ఆరోపించారు.మేడే స్ఫూర్తితో కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్,సమాన పనికి సమాన వేతనం కోసం,ఉద్యోగ,సామాజిక భద్రత కోసం పోరాడాలన్నారు.కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను నిలుపుదల చేయాలని,పనిగంటల పెంపుదలను వ్యతిరేకిస్తూ జిల్లాలో 139 వ మేడే జరుపుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ డ్రైవర్లు,కార్మికులు రాము,శాంతికుమార్,విజయ్,లక్ష్మణ్, సంతోష్ గౌడ్, సాయిలు,నరేష్,భూపతి,జగదీష్,గంగమణి,యాదమ్మ,శైలజ,శ్రీధర్ ,నాగరాజు,అశోక్,విజయలక్ష్మి,గంగాధర్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

